క్లుప్తంగా

కన్నుల పండువగా గౌరీదేవి ఉత్సవం



తంటికొండలో అమ్మవారి సారెను ఊరేగిస్తున్న గ్రామస్తులు

గోకవరం: మండలంలోని తంటికొండలో గౌరీదేవి ఉత్సవం బుధవారం కన్నులపండువగా జరిగింది. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సారెను గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత కొన్నేళ్లుగా గ్రామంలో గౌరీదేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఏటా అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీ అని గ్రామ పెద్దలు తెలిపారు. విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో బుధవారం మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించినట్టు డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రముఖ వక్త, రచయిత, నాక్ సభ్యురాలు, సామాజిక కార్యకర్త ఎంవీ లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. లింగ సమానత్వం, ప్రగతిశీల సమాజాన్ని రూపొందించడంలో మహిళలు కీలక పాత్ర తదితర అంశాలను వివరించారు. వైస్ చాన్సలర్ ఎస్.రమాశ్రీ, ఆర్.సునీత, యు.రాజ్యలక్ష్మి, ఎస్.అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

జగ్గంపేట: మండలంలోని గొల్లలగుంటలో సారా స్థావరాలపై స్థానిక ఎస్సై రఘునాథరావు ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో గొల్లలగుంట గ్రామానికి చెందిన తలారి రాజును అరెస్టు చేసి అతని నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు. సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు చెప్పారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరచగా డిసెంబర్ 1వ తేదీ వరకూ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పెదమల్లాపురంలో...

ప్రత్తిపాడు: శంఖవరం మండలం పెదమల్లాపురం గిరిజన గ్రామ శివారుల్లో సారా స్థావరాలపై బుధవారం ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పునం వంశీరామ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 13 మంది అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక పోలీస్ సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు, అన్నవరం, ఏలేశ్వరం మండలాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి 13 మందిని అరెస్టు చేసినట్టు స్థానిక సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. నిందితులను బుధవారం స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచినట్టు చెప్పారు. వీరిలో ఇద్దరు నిందితులకు న్యాయమూర్తి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించారు. మరో తొమ్మిది మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాలల్లో మద్యం సేవిస్తున్న మరో ఇద్దరికి ఒక్కొక్కరికీ రూ.500 వంతున జరిమానా విధించినట్టు ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు వివరించారు.

అన్నదానం

శంఖవరం: మండలంలోని ఆంధ్రా శబరిమలైలో భక్తులకు ఆలయ చైర్మన్ కుసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం భారీ అన్నదానం నిర్వహించారు. అయ్యప్ప మాలధారులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తొలుత పండితులు స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోపాలపట్నంలో...

తొండంగి: కార్తిక మాసం సందర్భంగా గోపాలపట్నం గ్రామదేవత నేరేళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన దాత రాగత సత్యనారాయణ కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో ఈ అన్నదానం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని అన్నప్రసాదం స్వీకరించారు.

మట్టి నమూనాల ఆధారంగా పంటలు వేసుకోవాలి

కోటనందూరు: మట్టి నమూనా ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ రైతులకు సూచించారు. మండలంలోని భీమవరపుకోట, జగన్నాథపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ఏడాది మట్టి నమూనాల ఆధారంగా ఎక్కువమంది పొలాల్లో నత్రజని, పొటాష్, జింకు లోపమున్నట్లు గుర్తించామన్నారు. వచ్చే రబీ, ఖరీఫ్ పంటలకు ఈ లోపాలను పూడ్చే దిశగా అడుగులేయాలన్నారు. మట్టి నమూనా ఫలితాల పత్రాలను రైతులకు పంపిణీ చేశారు.

అక్రమ తవ్వకాలు.. ప్రజలకు కష్టాలు

- తాండవ నది నుంచి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- నది పొడవునా పెద్దపెద్ద గోతులు
- మృత్యువాత పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



తాండవ నదిలో బొద్దవరం వద్ద ఇటీవల వ్యక్తి మృతి చెందిన ప్రాంతం



ఇసుక తవ్వకాలతో కోటనందూరు వద్ద కోతకు గురవుతున్న తాండవ నది ఒడ్డు



ఇసుక తవ్వకాలతో శిథిలమైన కామినీడువారి గ్రోయిన్

కోటనందూరు: స్థానిక తాండవ నది రాజకీయ నాయకులకు ఆదాయ వనరుగా మారింది. అధికార పార్టీ నేతల అండదండలతో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. అక్రమార్కులు నదిని కొల్లగొట్టేస్తున్నారు. ఇష్టారాజ్యంగా నదీగర్భంలో ఇసుకను తవ్వేసి జేబులు నింపుకుంటున్నారు. ఫలితంగా నది లక్ష్యం నెరవేరకపోగా పరివాహక ప్రాంత ప్రజలు మృత్యువాత పడుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ఒకప్పుడు దోబీలు నది ఒడ్డున బల్లలు (రాయిలు) ఏర్పాటు చేసుకొని దుస్తులు ఉతికేవారు. రైతులు వ్యవసాయ మకాలకు వెళ్లాలన్నా, స్థానిక ప్రజలు ప్రక్క గ్రామాలకు వెళ్లిరావాలన్నా నదిని దాటాల్సి ఉంది. ఇసుక తవ్వకాలతో ఇప్పుడా పరిస్థితి లేదు. ఇసుక మాఫియా తవ్వకాలతో ఎక్కడికక్కడ భారీగా గుంతలు పడ్డాయి. దీంతో నది ఒడ్డుకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

తరచూ ప్రమాదాలు

వరదలు వచ్చినప్పుడు దురదృష్టవశాత్తూ మృత్యువాత పడడం సాధారణం. ప్రస్తుతం సాధారణ పరిస్థితుల్లోనూ ప్రజలు మృత్యువాత పడుతున్నారు. గతంలో తాండవ నదిలో పడి అనేకమంది మృతి చెందగా తాజాగా రెండు రోజుల క్రితం బొద్దవరం గ్రామానికి చెందిన వ్యక్తి నది గోతులో పడి మృతి చెందాడు. పర్యావరణాన్ని కాపాడడంతో పాటు పంటపొలాలకు సాగునీరు, పశువులకు తాగునీరు అందించే తాండవనది ప్రమాదకరంగా మారుతున్నా అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో నిస్సహాయులుగా మారిపోయారు. ఇప్పటికైనా ఇసుకమాఫియాకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్‌లో పెనుప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

నిబంధనలకు విరుద్ధంగా..

సుమారు 60 వేల ఎకరాలకు సాగునీరు అందించే తాండవ జలాశయంలోని అదనపు జలాలను సముద్రానికి పంపించేందుకు ఏడు దశాబ్దాల క్రితం తాండవనది ఏర్పడింది. తాండవ జలాశయం నుంచి తుని వరకూ 25 కిలోమీటర్లు మేర విస్తరించి ఉన్న ఈ నది నుంచి స్థానికుల అవసరాల నిమిత్తం నది రూపం పాడవకుండా పంచాయతీకి కప్పం కట్టి ఇసుకను తరలించుకునే వెసులుబాటు ఉంది. ప్రస్తుతం రాజకీయ నాయకుల జోక్యంతో ఇసుక తవ్వకాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయి. కాలం, పరిస్థితులతో సంబంధం లేకుండా సంవత్సరం పొడవునా రాత్రి, పగలు ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు.

శిథిలమైపోతున్న గ్రోయిన్లు

తాండవ పంటకాలువల ద్వారా నీరు అందని పొలాలకు సాగునీరు అందించేందుకు తాండవ నదిలో అల్లిపూడి, కొట్టాం, కోటనందూరు, కామినీడు, దిగువాయి గ్రోయిన్లను నిర్మించారు. ఈ గ్రోయిన్ల ద్వారా సుమారుగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఈ గ్రోయిన్లకు అన్ని వైపులా ఇసుకను తవ్వేయడంతో వరదల సమయంలో గ్రోయిన్లు కొట్టుకుపోతున్నాయి. ఏటా సాగునీటి కోసం గ్రోయిన్ల కింద రైతులు లబోదిబోమనే పరిస్థితి నెలకొంది. దిక్కులేని పరిస్థితుల్లో సొంతనిధులతో గ్రోయిన్లకు తాత్కాలిక మరమ్మతులు చేయించుకొని రైతులు కాలం వెళ్లదీస్తున్నారు.

30 సెంట్ల భూమి కోతకు గురైంది

నాకు తాండవ నది గట్టును ఆనుకొని 1.7 ఎకరాల జిరాయితీ భూమి ఉంది. నదిలో భారీగా ఇసుక తవ్వకాలు జరగడం వల్ల గట్టు కోతకు గురై నా భూమిలో 30 సెంట్లు నదిగర్భంలో కలిసిపోయింది. ఇసుక తవ్వకాలు ఆపాలని స్థానిక, జిల్లాస్థాయి అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

రాజారావు, ఇసుక బాధితుడు, కోటనందూరు

గిరిజన బాలికకు ఎంబీబీఎస్ సీటు



జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థిని తల్లి

కోటనందూరు: మండలంలోని అల్లిపూడి కేజీబీవీలో చదివిన గిరిజన బాలిక టి.గాయత్రి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. బాలికల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ గాయత్రిని అభినందించి ప్రశంసాపత్రం, మెడల్ అందజేశారు. శంఖవరం మండలం వేలంగికి చెందిన గాయత్రి అల్లిపూడి కేజీబీవీలో 2020–21 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో టాపర్‌గా నిలిచింది. ఇంటర్ తరువాత నీట్‌లో విజయం సాధించి రాజానగరం జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో ఉచిత సీటు సాధించింది. గాయత్రి ప్రతిభను గుర్తించి జిల్లా అధికారులు బహుమతి ప్రదానం చేశారు. ప్రతిభ చూపిన గాయత్రిని అల్లిపూడి, శంఖవరం ఎస్ఓలు రాజేశ్వరి, బాలమణికుమారి అభినందించారు.

బీమా ప్రీమియం చెల్లించాలి

తుని రూరల్: రబీలో సాగు చేసే అపరాలకు రైతులు పంట బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ సూచించారు. మండలంలోని కొలిమేరు, కుమ్మరిలోవ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఎకరాకు రూ.300 చొప్పున బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు. పంట రుణా లు తీసుకుంటే బ్యాంకులు ప్రీమియం మొత్తాన్ని మినహాయించి నగదు ఇస్తుందన్నారు. రుణాలు తీసుకోని రైతులు నేరుగా ప్రీమియం చెల్లించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



ఏలేశ్వరంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి జ్యోతి

ఏలేశ్వరం: దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి సూచించారు. మండలంలోని సి.రాయవరం, యర్రవరం, సిరిపురం, భద్రవరం, లింగంపర్తి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సాధారణ రకం 100 కేజీల బస్తాకు రూ.2,300, సాధారణ రకం 75 కేజీల బస్తాకు రూ.1,725, గ్రేడ్ ఎ రకం 100 కేజీలు 2,320, గ్రేడ్ ఎ రకం 75 కేజీల బస్తాకు రూ.1,740 చొప్పున మద్దతు ధర ప్రకటించిందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని తేమ 17 శాతం లోపు ఉండేలా ఆరబెట్టుకోవాలన్నారు. ధాన్యాన్ని రవాణా చేసేందుకు జీపీఎస్ ఉన్న వాహనాలను వినియోగించుకోవాలన్నారు. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు. అనంతరం కళ్లాల్లో ధాన్యాన్ని ఆమె పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు అభ్యర్థన మేరకు అరబిందో ఫార్మా కంపెనీ సీఎస్ఆర్ నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామంలో 1200 మీటర్ల మేర సీసీరోడ్డు నిర్మాణానికి గ్రామ పెద్ద యనమల నాగేశ్వరరావు, ఎంపీటీసీ యనమల సూర్యారావు భూమి పూజ చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలకు అరబిందో ఫార్మా సంస్థ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మ కంపెనీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 104 సిబ్బంది నిరసన



బూరుగుపూడిలో సర్పంచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

కిర్లంపూడి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది చేపట్టిన నిరసన కొనసాగుతోంది. సీఐటీయూ ఆదేశాల మేరకు బుధవారం 7వ రోజు మండలంలోని గ్రామ పంచాయితీల సర్పంచులకు వినతి పత్రాలు అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలివేల చిట్టిబాబు, డీఈఓ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శంఖవరం: 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను డిమాండ్ చేశారు. మండలంలోని రాచపల్లిలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనును 104 ఉద్యోగులు కలిసి 14 రోజులు పాటు చేపట్టే ఉద్యమానికి మద్దతు కోరారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ శ్రీను మాట్లాడుతూ వైద్య రంగానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వంలో వైద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, 104 ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వనసమారాధనలు



జి.కొత్తపల్లి వనసమారాధనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు



గోకవరం ఆర్యవైశ్య కార్తిక వనసమారాధనకు హాజరైన మహిళలు

శంఖవరం: వనసమారాధనలతో మానవ సంబంధాలు మెరుగు పడతాయని మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఈగల రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈగల విజయదుర్గ, మాజీ జెడ్పీటీసీ ఈగల అప్పారావు, ఎడ్ల సత్యనారాయణ, ఈగల మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వనసమారాధన

గోకవరం: రంపయర్రంపాలెం వెళ్లే మార్గంలోని బురదకాలువ సమీపం మామిడితోటలో బుధవారం ఆర్యవైశ్య వనసమారాధన నిర్వహించారు. శ్రీవాసవీ ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో తొలుత ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోపూజ జరిపారు. మధ్యాహ్నం సంఘం సభ్యులు సహపంక్తి భోజనాలు చేశారు. చిన్నారులు, మహిళలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా సత్యదేవుని గ్రామోత్సవం



ప్రత్తిపాడులో సత్యదేవుని గ్రామోత్సవం

ప్రత్తిపాడు: గ్రామంలో బుధవారం వీరవెంకటసత్యనారాయణ స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. సత్యదీక్ష ప్రచార కర్త నల్లమిల్లి కృష్ణబాబు, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి శింగిలిదేవి సత్తిరాజు ఆధ్వర్యంలో సత్యదేవుని పల్లకిలో ఆశీనులు గావించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లమిల్లి కృష్ణబాబు మాట్లాడుతూ ఈ నెల 22న సత్యదేవుని పడిపూజ, 23న సత్యదేవుని మాల వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బుద్దా గంగా పార్వతి, దాడిశెట్టి శేషగిరి, కందా నారాయణరావు, మద్దాల దేవి, వానపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీహరిరాజు

జగ్గంపేట: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సూచించారు. జగ్గంపేటలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు బుధవారం జగ్గంపేట ఎస్సై రఘునాథరావు ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ దేవరపల్లి చెన్నారావు, జాతీయ సేవా పథకం కో ఆర్డినేటర్ పీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

తుని: ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతికను ఉపయోగించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆదేశాల మేరకు స్థానిక వివేకా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్, కేవైసీ, జాబ్స్, స్టాక్ మార్కెట్ తదితర వాటిని ఉపయోగించి నేరాలు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గీతా రామకృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేకుల షెడ్డు కూల్చివేత



కృష్ణునిపాలెంలో జేసీబీతో రేకుల షెడ్డును కూల్చివేస్తున్న దృశ్యం

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం ఎస్సీ కాలనీ వద్ద కొత్తూరు వెళ్లే మార్గంలో ఉన్న రేకుల షెడ్డును బుధవారం అధికారులు తొలగించారు. పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో షెడ్డును పూర్తిగా తొలగించారు. కాగా ఈ స్థలంలో ఏళ్ల తరబడి తమ పెద్దలు శాశ్వత నివాశం ఏర్పరుచుకుని జీవిస్తున్నారని గరుగుబిల్లి ధనుంజయ తెలిపారు. 2020లో ఈ స్థలంలో ఉన్న పూరిపాక విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోవడంతో 2022లో రేకుల షెడ్డు నిర్మించుకున్నామని, వైఎస్సార్ సీపీ కార్యకర్త అనే ఉద్దేశంతో అన్యాయంగా తమ ఇంటిని పడగొట్టి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారని ధనుంజయ వాపోయారు. అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్‌లో కిచెన్ గార్డెన్‌కు స్థలం కేటాయించాల్సి ఉందని, ఆక్రమణలో ఉన్న ఈ స్థలాన్ని పంచాయతీ స్వాధీనం చేసుకుని అంగన్‌వాడీకి అప్పగిస్తుందని తెలిపారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాదిగల జోలికొస్తే సహించం

కోటనందూరు: రాజకీయ శక్తులు మాదిగల జోలికొస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కొండేపూడి శ్యాంబాబు హెచ్చరించారు. మండలంలోని భీమవరపుకోట మాదిగపేటలో దిగువకు పోయే వృథా నీటిని రాజకీయంగా అడ్డుకోవడాన్ని నిరసిస్తూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బాధితులతో కలిసి బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా శ్యాంబాబు మాట్లాడుతూ మాదిగలను ఇబ్బందులకు గురి చేసినా, వారి హక్కులను కాలరాసినా ఊరుకునేది లేదన్నారు. ఎస్సార్‌పేట, బిళ్లనందూరు తదితర గ్రామాల్లో మాదిగలు అనేక ఏళ్లగా సాగు చేసుకుంటున్న డీ పట్టాభూములను రాజకీయంగా లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని, దానిని విరమించుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్సైలకు వినతిపత్రాలు అందజేశారు. మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే, తుమ్మలపల్లి కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



గోకవరంలో అయ్యప్ప పడిపూజ

గోకవరం: గ్రామంలో అయ్యప్ప పడిపూజ బుధవారం ఘనంగా జరిగింది. తంటికొండ వెళ్లే మార్గంలోని సీఎండీ కేఎస్‌పీవీ లే అవుట్ ప్రాంగణంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వందల సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, జగదీష్‌శర్మ గణపతి, కుమారస్వామి, పార్వతీపరమేశ్వరులు, అయ్యప్పలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 41 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేసిన కంబాల శ్రీనివాసరావును అయ్యప్పస్వాములు ఘనంగా సత్కరించారు.

ఇరుముడుల స్వీకరణ

ఏలేశ్వరం: భక్తిశ్రద్ధలతో 40 రోజుల దీక్ష పూర్తి చేసుకున్న అయ్యప్ప మాలధారుల ఇరుముడుల స్వీకరణ ఉత్సవం పట్టణంలో బుధవారం ఘనంగా జరిగింది. స్థానిక శివాలయంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి వూర శ్రీను చేతులమీదుగా అయ్యప్పస్వాములు ఇరుముడులు స్వీకరించారు. అయ్యప్పస్వాములు, వారి కుటుంబ సభ్యులతో ఆలయం కళకళలాడింది. ఇరుముడుల స్వీకరణ అనంతరం ఊరేగింపుగా స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని వినాయకుని ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి ప్రత్యేక వాహనాలతో శబరిమలైకు పయనమయ్యారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు
- విజేతలకు బహుమతులు



ఏలేశ్వరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లైబ్రేరియన్ సత్యనారాయణ



వీరవరం గ్రంథాలయంలో బహుమతులు, సర్టిఫికెట్లతో విద్యార్థులు



జగ్గంపేటలో విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

తుని: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఎంఈఓ పి.గీతాదేవి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గీతాదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గ్రంథాలయ పఠనం అలవర్చుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని దినచర్యగా మార్చుకోవాలని సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు మంగరాజు, అవోగా అధ్యక్షులు కడింశెట్టి ప్రకాష్, పతంజలి శాస్త్రి పాల్గొన్నారు.

ఏలేశ్వరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తకపఠనం అలవర్చుకోవాలన్నారు. పుస్తకపఠనం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పలివెల శివాజీ, కనకరాజు, రిటైర్డ్ అధ్యాపకుడు చెన్నాప్రగడ సత్యగాంధీ, పాఠకులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, వీరవరం, గెద్దనాపల్లి శాఖా గ్రంథాలయాల్లో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వీరవరంలో గ్రంథాలయాధికారి వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు వేడుకలకు స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ కె.నరసింహం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. డి.నాగేశ్వరరావు, తోట సీతారం, కె.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు లైబ్రేరియన్ భాస్కరరావు ఆధ్వర్యంలో బహుమతులు, షీల్డ్స్, సర్టిఫికెట్లు అందజేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయల సంఘం నేతలు చంద్రమౌళి వెంకటశాస్త్రి, మల్లేశ్వరరావు, అక్షర విద్యాలయ ప్రిన్సిపాల్ అనురాధ దేవి పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎంవీకే మెహర్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సముపార్జనతో పాటు ఉన్నత వ్యక్తిత్వం అలవడుతుందన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్, పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దివాకర్, ఎన్.ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.రాము, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రత్తిపాడులో ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థికి బహుమతి అందజేస్తున్న జడ్జి కాటం భాను

ప్రత్తిపాడు: ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదగాలని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కాటం భాను సూచించారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణితం, జీకే, సైన్సు, సోషల్ సబ్జెక్టులపై పలు ప్రశ్నలు సంధించారు. సరైన సమాధానాలిచ్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులందరికీ బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వసతిగృహం సంక్షేమాధికారి ఎం.సత్యనారాయణ, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.